క్లుప్తంగా

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మక్తల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని మక్తల్ మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి అన్నారు. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు శనివారం భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండు రిజర్వాయర్లు ఉండటం మన అదృష్టమన్నారు. ఏడాదిలో రెండు పంటలు సాగు చేసి అధిక లాభాలు పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మెన్ గణేశ్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ కట్టసురేశ్, కావాలి తాయప్ప, నాగిరెడ్డి, డీఈ సురేస్‌కుమార్, ఏఈఈ నాగశివ, కృష్ణయ్యగౌడ్ పాల్గొన్నారు.

కాల్వలపై నిర్మాణాలు చేపడితే చర్యలు



కోస్గి రూరల్: నీటి పారుదలశాఖ ఆధీనంలోని కుంటలు, కాల్వలపై నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని నీటిపారుదలశాఖ డీఈ ఆనంద్‌కిషోర్ అన్నారు. శనివారం పట్టణంలోని పాతపూరికుంటలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలియడంతో పరిశీలించారు. పలువురు నిర్మాణాలు చేపట్టగా నోటీసులు జారీ చేసి అనుమతులు రద్దు చేయాలన్నారు. ఇకపై ఎవరైనా కాలువలు, కుంటలలో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

దామరగిద్ద: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈ నెల 7న ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి నర్సింహా పిలుపునిచ్చారు. శనివారం మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నాయకుడు మందకృష్ణ మాదిగా ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, అంజనేయులు, ఈశ్వర్ బాబు, ఈదప్ప, నర్సింములు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి

నారాయణపేట రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలను పాటిస్తే రోగాలు దరి చేరకుండా నివారించవచ్చని డాక్టర్ విరోజా అన్నారు. చిన్న జట్రం సబ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో నిర్వహించిన హెల్త్ క్యాంప్‌లో ఆమె పాల్గొని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. తద్వారా డెంగీ, మలేరియా తదితర వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చన్నారు కార్యక్రమంలో ఏఎన్ఎం అనిత, ఆశా కార్యకర్త అనిత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై డీఈఓకు వినతి



నారాయణపేట రూరల్: మక్తల్ బీసీ కాలనీ, జగ్జీవన్ నగర్ లలో కొత్త పాఠశాలలు ఏర్పాటు చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హైమావతి సూర్యచంద్ర కోరారు. ఈ మేరకు శనివారం డీఈఓ గోవిందరాజును కలిసి వినతి పత్రం అందజేశారు. పాఠశాలల ఏర్పాటుతో పాటు మంతన్ గోడ్ జడ్పీ స్కూల్లో ఫిజిక్స్ టీచర్, ఖానాపూర్ యూపీఎస్ పాఠశాలలో టీచర్ల కొరతను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

హనుమాన్ చాలీసా పారాయణం

నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ గ్రామంలో శనివారం భజరంగ్ దళ్ నూతన కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ హైందవ సోదరులు, చిన్నారులు ఆలయంలో సమావేశమై సామూహికంగా హనుమాన్ చాలీసా పఠించారు. కార్యక్రమంలో గ్రామ సంయోజక్ సురేష్, సహ సంయోజక్ నరేష్, తిమ్మప్ప, గో సంరక్షక్ నరేష్, అయ్యప్ప, మహేష్ పాల్గొన్నారు.

నిధుల కొరత.. అన్నదాతల వెత



ముడుమాల్ ఎత్తిపోతల పథకంలో పనిచేయని మోటార్లు



మురహర్‌దొడ్డి పంపుహౌజ్ నుంచి అరకొరగా నీటి తరలింపు

- మరమ్మతుకు నోచుకోని మోటార్లు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

కృష్ణా: అన్నదాతల సంక్షేమం, నదితీర ప్రాంతాల భూములకు నీళ్లు అందించేందుకు ప్రభుత్వం 1984లో కృష్ణా, మాగనూర్ మండలాల్లో ఆరు ఎత్తిపోతల పథకాలను ప్రారంభించింది. కృష్ణా మండలంలోని కౌహల్లి ఎత్తిపోతల పథకం కుసుమర్తి గ్రామం వద్ద అలాగే కృష్ణా గ్రామం, గుడెబల్లూర్ 1, గుడెబల్లూర్ 2, మురహర్‌దొడ్డి గ్రామాల్లో మొత్తం ఐదింటిని ప్రారంభించింది. ఆ తరువాత 1997లో మరో రెండు ముడుమాల్ 1, ముడుమాల్ 2 ఎత్తిపోతల పథకాలకు కూడా శ్రీకారం చుట్టింది. సాగు నీటి కష్టాలను తీర్చడానికి పథకాలను ప్రారంభించారు కానీ నిర్వహణను గాలికొదిలేయడంతో వాటి లక్ష్యం నెరవేరడం లేదు.

ఎత్తిపోతల పథకాల పరిస్థితి ఇలా..

గుడెబల్లూర్ 2 ఎత్తిపోతల పథకంలో మోటార్లు పనిచేయడం లేదు. దీని మూలంగా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా నీరు అందక రైతుల పొలాలు బీడుగా మారిపోయాయి. దీంతో ఈ పథకం కింద ఉన్న భూముల్లో రైతులు వర్షాధారం పంటలు మాత్రమే సాగు చేస్తున్నారు. అలాగే కుసుమర్తి ఎత్తిపోతల పథకంలో 3 మోటార్లు, కృష్ణా ఎత్తిపోతల పథకంలో 2 మోటార్లు, మురహర్‌దొడ్డిలో 3 మోటార్లు, ముడుమాల్ 1 రెండు, ముడుమాల్ 2లో 2 మోటార్లు మరమ్మతుకు గురికావడంతో సాగుకు నీరందని పరిస్థితి నెలకొంది. దీంతో ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తుందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎత్తిపోతల నిర్వహణ బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పుకొని రైతులకు అప్పగించినప్పటి నుంచి తమకు కష్టాలు మొదలయ్యాయని స్థానిక రైతులు పేర్కొంటున్నారు. మండలంలోని ఏ ఎత్తిపోతల పథకం చూసిన సగానికి పైగా మోటార్లు పనిచేయడం లేదు. వాటిని బాగు చేయాలంటే రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుండడంతో అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. మూడు మోటార్లు నడువాల్సిన చోట రెండు, రెండు నడువాల్సిన చోట ఒకటి ఇలా రైతులు ఇన్నాళ్లు నెట్టుకొచ్చారు. ప్రస్తుతం చెడిపోయిన మోటార్లను ప్రభుత్వం బాగు చేసి ఇవ్వాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎప్పుడో 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మోటార్లు ఇంకా ఎన్నాళ్లు వస్తాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. చిన్నచిన్న మరమ్మతులు ఉంటే తాము బాగు చేసుకునే వాళ్లమని, పంపుసెట్లు పూర్తిగా పనికి రాకుండా తయారయ్యాయని వాపోతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



ఎత్తిపోతల పథకాల మోటార్లు, పంప్‌హౌజ్‌లు మరమ్మతుకు గురికావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వీటిని బాగు చేస్తే మరో పదేళ్లు ఉపయోగపడతాయి. లేదంటే వర్షాలకు మొత్తం పనికిరాకుండా పోతాయి. ప్రభుత్వం వీటి మరమ్మతుకు ఏటా ఎంతో కొంత నిధులు కేటాయిస్తే తప్ప నిర్వహణ సాధ్యం కాదు.

–దేవప్ప, ఆయకట్టు రైతు, మురహర్‌దొడ్డి

రిపేర్‌కు రూ.లక్షల్లో ఖర్చు



ఒక్క మోటార్ రిపేర్ చేయించడానికి దాదపు రూ.80వేల నుంచి రూ.లక్ష ఖర్చు అవుతుంది. దీంతో రైతులు అంత పెద్ద మొత్తం భరించలేకపోతున్నారు. పైపులు కూడా పగిలిపోవడంతో మరమ్మతుకు వెనుకాడుతున్నారు. ప్రభుత్వమే నిధులు మంజూరు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

–రాకేష్, ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



మాగనూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



మద్దూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జాతీయ వేదిక నాయకులు

నారాయణపేట రూరల్: దివ్యాంగుల పెండింగ్ పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాశప్ప డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో వినతి పత్రం అందించి మాట్లాడారు. చేయూత పెన్షన్ కోసం 25 లక్షల మంది దివ్యాంగుటు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టిందన్నారు. దివ్యాంగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పెండింగ్ పెన్షన్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలరాజ్, బసవరాజ్, హనుమంత్ రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రూ.6వేలు పెన్షన్ అందించాలి

మాగనూర్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు పూంజనూర్ బాబు కోరారు. ఈ మేరకు శనివారం మాగనూర్ తహసీల్దార్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. వెంటనే పెండింగ్‌లో ఉన్నటటువంటి పెన్షన్లను అమలు చేసి, దివ్యాంగుల కార్పొరేషన్‌ను బలోపేతానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.6వేల పెన్షన్ హామీని అమలు చేయాలని కోరారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాలలో వికలాంగులకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టాలు చేసి అమలు చేస్తున్నారని తెలంగాణలో కూడా ఆ దిశగా అసెంబ్లీలో చట్టం చేయాలన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు బాబు, వర్క్యార్ రవి, లక్ష్మినారాయణ, లంగటి వాబయ్య, వర్క్యార్ వెంటప్ప పాల్గొన్నారు.

బకాయి పెన్షన్‌లను విడుదల చేయాలి

కృష్ణా: దివ్యాంగుల పెండింగ్ పెన్షన్‌లను తక్షణమే విడుదల చేయాలని మండల దివ్యాంగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వెంకటేష్, చంద్రశేఖర్, హన్మంతు, హేమలత, జగదీష్, తిమ్మప్ప పాల్గొన్నారు.

మద్దూరు: ప్రభుత్వం చేయూత పింఛన్లను పంపిణీ చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మద్దూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో 43.02 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని వారు అనేక సమస్యలతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందరికీ చేయూత పింఛన్లు పంపిణీ చేసి ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ మహేష్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న నాగూరావు నామాజీ

నారాయణపేట రూరల్: పట్టణంలోని ఐదుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత నాగూరావు నామాజీ శనివారం పంపిణీ చేశారు. దేవేంద్రమ్మకు రూ.60 వేలు, మల్లేశ్‌కు రూ.37,500 రూ.శివలీలకు రూ.18 వేలు, జామున రాణికి రూ.12 వేలు, సంతోషమ్మకు రూ.10,500 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నామాజీ మాట్లాడుతూ ప్రజల కోసం అమలు చేసే ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాధితులు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స ఖర్చుల కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వెంకట్ రాములు, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ, పట్టణ అధ్యక్షుడు వినోద్ కుమార్, వెంకటయ్య, శ్రీనివాస్, మహదేవ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇమాం ఖాసీం సవారీ



నర్వలో పీర్లను దర్శించుకుంటున్న భక్తులు

నర్వ: మండలంలో శనివారం ఆయా గ్రామాల్లో ఇమాం ఖాసీం పీర్ల సవారీని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నర్వ మండల కేంద్రం, పెద్దకడ్మూర్‌లో రాత్రి పీర్ల చావిడీల వద్ద ప్రజలు అలాయ్ ఆటలు ఆడారు. ఇమాం ఖాసీం పీర్ల సవారీలో పీర్లకు దట్టీలు, మాలీజాలను పంచి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో సాహెబుహుస్సేన్, మౌలాలీ, నజీర్, ఖాజా, హుస్సేన్‌ఖాన్, అశ్వక్, దౌలత్, తదితరులు పాల్గొన్నారు.

పీర్ల ఊరేగింపు

ధన్వాడ: మండలంలో శనివారం కాసీంసాబ్ పీర్ల వేడులను జరుపుకున్నారు. శనివారం పీర్ల చావిడి నుంచి ఊరేగింపుగా బయలుదేరి ప్రధాన వీధుల గుండా తిరుగుతూ పాత సంతబజార్ వద్ద కాసీం సాబ్ పీరు తమ్ముడు చోట కాసీంసాబ్ పీరు అలాయ్ తీసుకున్నాయి. దీనిని చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

యువకులపై కేసు నమోదు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని లాల్‌మసీదు దగ్గరలో ఓ యువకుడిపై దాడి చేసిన ఘటనలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఈనెల 2న పట్టణంలోని లాల్‌మసీదు దగ్గర మొహర్రం వేడుకలకు సన్నా హాలు చేస్తున్న నేపథ్యంలో జాఫర్ పటేల్ సుఫియాన్ షా, సమీర్ షా, అర్బాజ్ షా అనే యువకులు హసనుద్దీన్‌పై ఇనుపరాడ్లతో దాడి చేశారు. దీంతో హసనుద్దీన్ తలకు తీవ్రగాయం కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ క్రమంలో బాధితుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన సాహితీ ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. శనివారం విడుదలైన మొదటి జాబితాలో ఆమె పేరు ఉండడంతో బాసర, మహబూబ్‌నగర్‌లోని కళాశాలలో సీటు పొందే అవకాశం లభించింది. ఈ మేరకు సాహితిని పాఠశాల ఆవరణలో జీహెచ్ఎం సునీత, టీచర్లు, గ్రామపెద్దలు అభినందించారు.

పాలమూరు ట్రిపుల్ ఐటీకి ఎంపిక



నర్వ: మండలంలోని పాథర్చేడ్ గ్రామానికి చెందిన నెట్టెంపాడు అభినవ్ అనే విద్యార్థి శనివారం విడుదలైన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో సత్తా చాటాడు. నర్వ ప్రతిభా పాఠశాలలో ఎస్ఎస్‌సీలో ఉత్తమ మార్కులు సాధించి పాలమూరు ట్రిపుల్ ఐటీ కళాశాలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ హన్మంతురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, పాథర్చేడ్ గ్రామస్థులు, తోటి విద్యార్థులు అభినందించారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



కోస్గి రూరల్: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని మున్సిపల్ మేనేజర్ అనిల్‌కుమార్ అన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం పట్టణంలోని 7వ వార్డులో తడి-పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో వేసి చెత్త సేకరణ సిబ్బందికి అందించాలన్నారు. చెత్తను కాలువలో పడిస్తే దుర్గంధం వెదజల్లి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అలాగే ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించి బట్ట సంచులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మోహిన్‌బాషా, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, కార్మికులు ఉన్నారు.

24 గంటలు విద్యుత్ అందుబాటులో ఉంచాలి

కోస్గి రూరల్: రోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో 24గంటలు విద్యుత్ అందుబాటులో ఉంచాలని నారయణపేట్ జిల్లా డీఈ నరసింహరావు తెలిపారు. శనివారం గుండుమాల్ , కోస్గి పట్టణంలోని సబ్‌స్టేషన్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్‌కు అంతరాయం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ అసుపత్రిలో 24 గంటల విద్యుత్ సరఫరా అందుబాటులో ఉంచాలని అందుకు రెండు ఫీడర్ల ద్వారా సప్లై అందించాలన్నారు. ఆయన వెంట విద్యుత్ ఏఈ వెంకటేశ్ , లైన్‌మెన్‌లు ఉన్నారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..



కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: ప్రభుత్వ భూమి కబ్జాకు గురి కావడంపై సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని 58 సర్వే నంబరులోని దాదాపు 10 ఎకరాలను కొందరు రైతులు చదును చేసి ఆక్రమించుకున్నారు. ఈ క్రమంలో శనివారం మండల సర్వేయర్ అశోక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్‌తో కలిసి కబ్జాకు గురైన భూమిని పరిశీలించారు. అనంతరం భూమి సరిహద్దులను గుర్తించి హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్న రైతులను పిలిచి పాస్ బుక్కులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జయరాములు హెచ్చరించారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే టోల్‌ఫ్రీ నంబరు 91542 83914 నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు



వాగులో ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

మాగనూర్: మండల కేంద్రంగా వాడూరం నుంచి జరుగుతున్న ఇసుక తరలింపును గ్రామస్తులు అడ్డుకున్నారు. మండల కేంద్రంలోని పెద్దవాగు నుంచి కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకంలో భాగంగా పైపుల తయారు పనులకు ఇసుక తరలిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో ఇసుక తరలింపు వలన బోర్లు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఇసుకను తీసుకెళ్తున్న టిప్పర్లను శనివారం గ్రామస్తులు మరోసారి అడ్డుకున్నారు. ఇసుకను తరలించడం వల్ల గ్రామానికి తాగునీటి ఎద్దడి ఏర్పడటంతో పాటు వాగు పరివాహక ప్రాంతాల సాగు భూములు ఎడారిగా మారుతాయని వాపోతున్నారు. తమ గ్రామం నుంచి కాకుండా మరో చోట నుంచి ఇసుకను తీసుకెళ్లాలని చెబుతున్నా అధికారులు మాత్రం ఇక్కడే ఇసుక తరలిస్తామని మొండి పట్టుపట్టడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మాగనూర్ గ్రామ సమీపంలోని పెద్ద వాగు నుంచి ఇసుక తరలింపును ఎట్టి పరిస్థితులో జరగనివ్వబోమని స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామస్తులు సమావేశమై తీర్మానం చేశారు. అవసరమైతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకిచ్చిన హామీలు నెరవేర్చాలి

మాగనూర్: కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆటోడ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోడ్రైవర్లు జీవనోపాధి కోల్పోయారని, కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆటోడ్రైవర్లకు రూ.12 వేలు ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆంజనేయులు, గోవిందరాజులు, ఆటో యూనియన్ నాయకులు దండు బస్వరాజు, నామలి తిమ్మప్ప, డబ్బుడు వాబయ్య, శ్రీకాంత్, రవి, భీంరాజు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాము

నారాయణపేట: రైతాంగ ఉద్యమాలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర, జిల్లా మహాసభల్లో భాగంగా జూలై 25న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాము రైతాంగానికి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని హామీ ఇచ్చి మరిచిందన్నారు. రైతాంగ సమస్యలు పట్టించుకోకపోవడం, కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, చట్టాలు తీసుకురావడంతో వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలో నెట్టబడిందన్నారు. దేశంలో రైతాంగ సమస్యలను, మారిన ఆర్థిక రాజకీయ సామాజిక పరిస్థితులను శాస్త్రీయంగా విశ్లేషించుకుని దేశవ్యాప్తంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర మహాసభలు ఆగస్టు 25, 26న ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్వహించడానికి కమిటీలు నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు, రైతాంగ ఉద్యమకారులు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతు, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కృష్ణ, సహాయ కార్యదర్శులు కొండా నర్సింలు, నారాయణ, బాలకృష్ణ, రాములు, ఆనంద్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నారాయణపేట టౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8000 కోట్లకు పైగా స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. అదే విధంగా పై చదువులకు వెళ్లే విద్యార్థులకు బకాయిల సాకు చూపి సర్టిఫికెట్స్ జారీ చేయని ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే రాబోయే రోజుల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భాను ప్రసాద్, నాయకులు దీనేష్ వర్మ, అఖిల, మంజుల, శిరీష తదితరులు పాల్గొన్నారు.

'పెట్టుబడిదారుల లబ్ధికే లేబర్ కోడ్‌లు'



బైక్ ర్యాలీలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు లాభాలు చేకూర్చడానికే నాలుగు లేబర్ కోడ్స్ ప్రవేశపెట్టారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్ ఆరోపించారు. ఈ విధానాన్ని నిరసిస్తూ శనివారం ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ టౌన్ హాల్ నుంచి కొత్త బస్టాండు, న్యూటౌన్, రాజేంద్ర నగర్, రైల్వేస్టేషన్, ఎర్రసత్యం చౌరస్తా మీదుగా తెలంగాణ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అక్కడ కొద్దిసేపు ధర్నా నిర్వహించి వారు మాట్లాడారు. కార్మికుల శ్రమను దోచుకునేలా పనిగంటలు 12 నుంచి 14 వరకు పెంచడం, ఉద్యోగ భద్రత లేకుండా చేయడం తగదన్నారు. ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఇతర రంగాలలో పనిచేస్తున్న వారందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆయా కార్మిక సంఘాల నాయకులు డి.రాములు, సాంబశివుడు, ఖమర్‌అలీ, వరదగాలన్న, బి.చంద్రకాంత్, రాజ్‌కుమార్, తిరుమలయ్య, యాదయ్య పాల్గొన్నారు.

ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

అమరచింత: ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ అరవింద్ సూచించారు. మండల కేంద్రంలోని చంద్రగడ్‌లో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరిగే పథకాలకు గాను అదే విధంగా పీఎం కిసాన్ డబ్బులు పడడానికి ఫార్మార్ రిజిస్ట్రీ అనేది కీలక ఆధారమన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

ప్రజాసమస్యలు పరిష్కరించండి

ఆత్మకూర్: మండల కేంద్రంలోని ప్రజాసమస్యలు పరిష్కరించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు ప్రసాద్, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సామేలు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చాంద్‌పాషకు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, పెన్షన్లు, గ్యాస్ సబ్సిడీ వంటి హామీలు అమలు చేయాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.